

విలువల విద్యాలయం

నేడు శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

7


గరవ్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నేడు పుట్టపర్తికి గవర్నర్ రాక

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

7



అసెంబ్లీ సాక్షిగా...

కర్నూలు జిల్లా కోర్టు

కర్నూలుకు హైకోర్టు బెంచ్

కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కందికుంట



కదిరి/లీగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కదిరిలో జిల్లా అదనపు న్యాయాధికారి (ఏడీజే) కోర్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అసెంబ్లీలో గురువారం ప్రభుత్వాన్ని కోరారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. రాయలసీమవ్యాప్తంగా కోటిన్నర మంది ప్రజల కేసుల పరిష్కారానికి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మాణం చేసిన న్యాయశాఖ మంత్రి ఫారూక్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంతో రాయలసీమ కేసుల సత్వర పరిష్కారానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. నైసర్గికంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దదైన కదిరిలో ఏడీజే కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. ఇది కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే.. సభలో కోరారు.

కళ్యాణి రాకతో మారనున్న

మడకశిర రూపురేఖలు

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మడకశిరటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రూ.1430కోట్లతో కళ్యాణి స్ట్రాటిజిక్ సిస్టమ్ లిమిటెడ్ సంస్థ మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రావడంతో మడకశిర ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ప్రాజెక్టును మడకశిరకు తీసుకురావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ పాలనలో వేధింపులు భరించలేక రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన పరిశ్రమలను తిరిగి రప్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

ఆర్టీసీలో మోనార్క్..!





చిన్న తప్పులకే కార్మికులకు పెద్ద శిక్షలు

- ఎడాపెడా సస్పెన్షన్లు
- వాటిని ఎత్తి వేసేందుకు ముడుపులు?
- పని చేయలేమంటూ కార్మికుల ఆవేదన

> ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారి రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) మధుసూదన్ మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి. కార్మికులు చిన్న తప్పు చేసినా.. పెద్ద శిక్షలు వేస్తూ హడలెత్తిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎడాపెడా సస్పెండ్ చేస్తూ.. ఆనక, దానిని ఎత్తి వేసేందుకు ముడుపులు డిమాండ్ చేస్తున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా కార్మికులపై సస్పెన్షన్ విధిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ముడుపుల కోసమే సస్పెన్షన్ ఆయుధాన్ని ప్రయోగిస్తున్నారన్న వాదనలు లేకపోలేదు.
>
> - ధర్మవరం, ఆంధ్రజ్యోతి

భూతద్దంలో వెతుకుతూ..

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలోనే ఆర్టీసీలో సస్పెన్షన్ల పరంపర కొనసాగుతోంది. దీంతో విధులు నిర్వహించాలంటేనే కార్మికులు బెంబేలెత్తుతున్నారు. వారి ఉద్యోగ భద్రత దినదినగండంగా మారుతోంది. చిన్నతప్పులను సైతం భూతద్దంలో చూపిస్తూ కార్మికులను వేధిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల విధి నిర్వహణలో చిన్నచిన్న తప్పులు దొర్లుతుంటాయి. గతంలో వాటిని ఉన్నతాధికారి పట్టించుకునేవారు కాదని కార్మికులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్ఎం మాత్రం వాటిని భూతద్దంలో చూస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన తీరుతో చిన్నపాటి తప్పులకు సైతం సస్పెండై ఉద్యోగాలు కోల్పోయినవారు ఎందరో ఉన్నారు.

ఉన్నతాధికారి నిర్ణయాల్లో కొన్ని..

- ఆర్టీసీ ధర్మవరం డిపోకి చెందిన బీఎస్ వాసులు ఈయన చెన్నేకొత్తపల్లి వైపు నుంచి ధర్మవరం వైపు వస్తుండగా బైక్ మీద వస్తున్న ఓ వ్యక్తి అడ్డంగా దూరడంతో ప్రమాదం జరిగింది. ఇందులో డ్రైవర్ తప్పు ఎంతమాత్రమూ లేదని తోటి కార్మికులకే కాదు, ఉన్నతాధికారికి కూడా తెలుసు. ఆ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా విధుల నుంచి పూర్తిగా తొలగించారు.
- ధర్మవరం డిపోకి చెందిన కండక్టర్ సరిత రూ.60 టికెట్ విషయంలో పొరపాటు జరిగిందని సస్పెండ్ చేశారు. ఆ తరువాత డిపో మార్చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమెను సస్పెండ్ చేశారని కార్మికులు పేర్కొంటున్నారు.
- డ్రైవర్ నాగేంద్రను కూడా సస్పెండ్ చేశారు. అనంతరం డిపోను మార్చివేశారు. ఇలాంటి వారు ధర్మవరం డిపోలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉన్నారు. ప్రస్తుతం సస్పెండై ఆ ఉన్నతాధికారి అనుగ్రహం కోసం దాదాపు 15 మందిదాకా వేచి చూస్తున్నారంటే ఆయన ఏకపక్ష నిర్ణయాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఆనక ముడుపులు..?

ముడుపుల కోసమే సస్పెన్షన్ల వేట కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిపో మేనేజర్ పరిధిలోనే పరిష్కరించుకోవాల్సిన వాటిని సైతం సస్పెన్షన్ వరకు తీసుకెళ్తున్నారని కార్మిక వర్గాలు ఆవేదన చెందుతున్నాయి. దీంతో చేసేదిలేక ఆ ఉన్నతాధికారి ఏర్పాటు చేసుకున్న మధ్యవర్తుల ద్వారా భారీగా ముడుపులు ముట్టజెప్పి, సస్పెన్షన్లు ఎత్తివేయించుకునే పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు వాపోతున్నారు. ఒక్కో సస్పెన్షన్ ఎత్తి వేయడానికి రూ.70వేల నుంచి రూ.1.50 లక్షదాకా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఆ శాఖవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 15 సస్పెన్షన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వారు కూడా ఆమ్యామ్యాలు సమర్పించుకోకపోతే కొనసాగుతూనే ఉంటాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

దినదినగండంగా ఉద్యోగం

ఆర్టీసీ కార్మికుల ఉద్యోగం దినదినగండంగా మారుతోంది. ఈరోజు ఉద్యోగం లోటుపాట్లు లేకుండా చేశామా.. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకునే దుస్థితి ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారి జిల్లాకు వచ్చినప్పట్నుంచి ఆర్టీసీ కార్మికులు బిక్కుబిక్కుమటూ విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే ఆర్టీసీలో కార్మికుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఎడాపెడా సస్పెన్షన్లు విధిస్తుండడంతో కార్మికుల కొరత ఏర్పడుతోందని ఆ వర్గాలు వాపోతున్నాయి.

ఆరోపణలు అవాస్తవం

కార్మికులందరినీ సమానంగా చూస్తున్నాం. నేను డబ్బు తీసుకుంటున్నట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవం. రూట్‌పై వెళ్లే అధికారులు కేసులు రాస్తున్నారు. నేను పక్షపాత ధోరణితో వ్యవహరించట్లేదు.

-మధుసూదన్, ఆర్టీసీ ఆర్ఎం

ఇంత దుర్మార్గమా..!

లేగ దూడలపై కత్తి

వధశాలలకు తరలిస్తున్న వైనం

గోరంట్లలో పట్టివేత

> రోజుల వయసున్న లేగదూడలు..
> తల్లి పాలు తప్ప..
> తిండి తినలేని పసిప్రాణాలు..
> అలాంటి వాటిపై
> కనీస కనికరం చూపట్లేదు..
> కబేళాలకు తరలించి..
> కర్కశం ప్రదర్శిస్తున్నారు..
> వాటి మాంసానికి డిమాండ్
> ఉందంటూ
> నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు..
> ఛీ.. ఛీ.. ఇంత దుర్మార్గమా..


పట్టుబడిన లేగదూడలతో సీఐ శేఖర్

గోరంట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వధశాలల్లో విచ్చలవిడిగా జంతువధ సాగిస్తున్నారు. రోజుల వయసున్న లేగ దూడలను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. వాటి మాంసానికి డిమాండ్ ఉండడంతో రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు తీస్తున్నారు. వధశాలలకు లేగదూడలను తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు గురువారం ఉదయం పట్టుకున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న పశువుల సంత నుంచి 11 లేగదూడలను గూడ్స్ వాహనంలో వధశాలకు తరలిస్తుండగా దాడులు చేసి, పట్టుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. కొన్ని రోజుల క్రితం జన్మించిన పాలుతాగే లేగదూడలను చెన్నేకొత్తపల్లికి చెందిన గూడ్స్ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు దాడిచేసి, స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించారు. అలాగే సంత నుంచి మరో వాహనంలో 9 పాడి ఆవులను హిందూపురం వధశాలకు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. రెండు వాహనాలు, పశువులను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు. కొంతకాలంగా పశువుల అక్రమ రవాణా, వధ, గోమాంసం అక్రమ రవాణాపై పోలీసులు కేసులు పెట్టి, అరెస్టులు చేస్తున్నా ఏమాత్రం తగ్గట్లేదు. అలాగే సాగిస్తున్నారు. గురువారం పట్టుబడిన 11 లేగదూడలను పలువురు సంరక్షకులకు పోలీసులు అప్పగించారు.


వాహనంలో తరలిస్తున్న లేగదూడలు

మాలగుండ్ల అవినీతిపై సీబీఐ విచారణ చేయించాలి

గంపల రమణారెడ్డి డిమాండ్... గోరంట్లలో వైసీపీ పోటీ సమావేశం

గోరంట్ల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణ అవినీతిపై సీబీఐ విచారణ చేయించాలని గోరంట్ల సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గంపల రమణారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వర్గీయులు గురువారం సమావేశం నిర్వహించారు. ఉషశ్రీని రాష్ట్రంనుంచి పంపిచేస్తామంటూ పార్టీ బహిష్కృత నాయకులు బుధవారం చేసిన విమర్శల పట్ల గంపల తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యే కాకముందు మాలగుండ్ల ఆస్తులెన్ని, తరువాత ఎన్ని అని ప్రశ్నించారు. మంత్రిగా అనంతపురం, ధర్మవరం, పెనుకొండలో ఇళ్లు నిర్మించలేదా అని నిలదీశారు. తమ్ముళ్లను ఇన్‌చార్జిలుగా నియమించుకుని, నియోజకవర్గాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. శంకర్ నారాయణతో బహిష్కృత నాయకుల అక్రమాల చిట్టా పార్టీ అధిష్టానం వద్ద ఉందన్నారు. అందుకే శంకర్‌నారాయణను గత ఎన్నికల్లో అనంతపురం ఎంపీ స్థానానికి సాగనంపారని విమర్శించారు. ఆయనకు బినామీలుగా బహిష్కృత నాయకులు లెక్కలేనన్ని భూకబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అలాంటి చీడపురుగులను పార్టీ నుంచి పంపించేశారన్నారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ఉష శ్రీచరణ్ వర్గం నాయకులు



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం రాస్తారోకో

విడపనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతానికి గత పది రోజులుగా తాగునీరు రావడం లేదని మండల కేంద్రంలోని సుంకులమ్మ గుడి ప్రాంతవాసులు జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గౌరమ్మ పండుగ ఉన్నా తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. తాగునీరు లేక జీబీసీ వద్దకు వెళ్లి ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లలో తాగు నీటిని తెచ్చుకుంటున్నామని తెలిపారు. పై నున్న కాలనీలకు రోజు తాగు నీరు వస్తోందని కింద కాలనీలకు తాగు నీరు రావటంలేదని పేర్కొన్నారు. తాగునీరు ఇచ్చేంత వరకూ రాస్తారోకో విరమించేది లేదని రోడ్డుపై భైఠాయించారు. రాస్తా రోకో వద్దకు సీఐ చిన్నగౌస్ చేరుకుని మహిళలతో చర్చించారు. సాయంత్రంలోగా తాగు నీరు అందించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రాస్తారోకో విరమించారు. టీడీపీ నాయకులు ఈ విషయాన్ని వెంటనే మంత్రి పయ్యావుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామంలో తాగునీటి సమస్య ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ అధ్వర్యంలో సాయంత్రానికి తాగునీరు అందించి సుంకులమ్మ ఏరియాలో తాగు నీటి సమస్యను పరిష్కరించారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న సీఐ చిన్నగౌస్

మోడ్రన్ సాగు..!

ఇంటర్నెట్‌లో అన్వేషణ.. డ్రాగన్ ఫ్రూట్‌తో లాభార్జన..!

తండ్రి మెడికల్ షాపు నిర్వాహకుడు..
కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..
వ్యవసాయం చేయాలనుకున్నారు..
చేనులో బోరు వేశారు..
ఆధునిక పంటలపై దృష్టి పెట్టారు..
కుమారుడు ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి..
ఈ ప్రాంతం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు
అనుకూలమని గుర్తించాడు..
పంట సాగుకు ఉపక్రమించారు..
ఆధునిక పద్ధతులు అవలంబించారు..
మొదటి కోతలోనే లక్షల లాభాలు పండించారు..
ఇక రానున్నవన్నీ.. లాభాలే..





మల్లాపల్లి వద్ద సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట



డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడి

గోరంట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లికి చెందిన రైతు బాలకృష్ణ డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేసిన ఏకైక రైతుగా, లాభాలు పండిస్తూ ఆదర్శరంగా నిలుస్తున్నారు. ఆధునిక పద్ధతులతో పంట సాగు చేశారు. తొలి కోతలోనే పెట్టుబడిలో 90 శాతం రాబట్టారు.

వ్యాపారం నుంచి.. వ్యవసాయంలోకి..

మల్లాపల్లికి చెందిన బాబయ్యగారి బాలక్రిష్ణ డీ ఫార్మసీ చేశాడు. 1982లో గోరంట్లలో మెడికల్ దుకాణం ఏర్పాటు చేశాడు. 2018 వరకు కొనసాగించాడు. స్వగ్రామంలో సొంత పొలం ఉండడంతో అందులో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడడంతో మెడికల్ షాపును మూసేసి, వ్యవసాయం వైపు మళ్లాడు. వర్షపాతం తక్కువగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనువైన పంట సాగుచేయాలని దృష్టి సారించారు. కుమారుడు రవిశంకర్ ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి, గోరంట్ల వాతావరణానికి డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంటగా గుర్తించాడు. దీంతో 1.82 ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ పంటను రెండేళ్ల క్రితం సాగుచేశారు.



పంట దిగుబడిని చూపుతున్న రైతు బాలకృష్ణ

మొదటి కోతలోనే 90శాతం రాబడి

కర్ణాటకలోని పెసరగట్టలో ఒక్కో డ్రాగన్ మొక్క రూ.65 చొప్పున 3,200 కొనుగోలు చేశారు. 800 సిమెంటు స్తంభాలు నాటారు. వాటిపై ప్లేట్లు ఏర్పాటు చేశారు. స్తంభం చుట్టూ నాలుగు మొక్కల వంతున నాటారు. డ్రిప్ ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. ఎకరాకు రూ.4.50 లక్షల వంతున మొత్తం పంట సాగుకు రూ.9లక్షలు ఖర్చయింది. పశువుల ఎరువు, సూక్ష్మధాతువులను డ్రిప్ విధానంలో అందించారు. ఎప్పటికపుడు కలుపు తొలగిస్తూ వచ్చారు. 16 నెలలకు మొదటి పంట కోతకొచ్చింది. ఏడు టన్నుల దిగుబడి దక్కింది. దీంతో రూ.7.70 లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపాడు. పెట్టుబడిలో 90శాతం తొలికోతకే వచ్చిందని రైతు ఆనందం వ్యక్తం చేశాడు.

ఏటా దిగుబడి..

పది నెలల వ్యవధిలో ఏటా ఒకసారి దిగుబడి వస్తుంది. రెండో పంటలో ప్రస్తుతం 12 టన్నుల దిగుబడి వచ్చిందని రైతు తెలిపాడు. రూ.12లక్షల ఆదాయం సమకూరింది. ఖర్చులుపోను రూ.10లక్షలు మిగిలింది. తోట వద్దే వ్యాపారులకు కిలో రూ.వందతో విక్రయిస్తున్నారు. ఏటా ఎరువులు, కలుపుతీత, కూలీల కోసం రూ.50వేలు ఖర్చు చేస్తున్నట్లు రైతు తెలిపాడు.

ఈ ప్రాంతానికి అనువైన పంట

జిల్లాకు డ్రాగన్ ఫ్రూట్ అనువైన పంట. ఇక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి 10 నుంచి 15 రోజులకోసారి నీటి తడులు ఇవ్వాలి. చలికాలం చివరలో ఫంగస్ వచ్చే అవకాశం ఉంది. ఆ సమయంలో ఫంగస్‌ను గుర్తించి, కొమ్మలను కత్తిరించి, పడేయాలి. ఒకసారి పెట్టుబడి పెడితే 20నుంచి 25 ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. కాయలు పక్వానికి వచ్చిన వెంటనే సకాలంలో కోయకపోతే పగిలి పాడైపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మరింత లాభదాయకంగా ఉంటుంది.

- బాలకృష్ణ, రైతు, మల్లాపల్లి

ఏప్రిల్‌లో వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ

ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు



సిల్వర్ జూబ్లీ నిర్వాహక కమిటీతో మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 ఏప్రిల్ నెలలో రజతోత్సవాలు (సిల్వర్ జూబ్లీ) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నిర్వాహక కమిటీతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2000 సంవత్సరం నుంచి 2019 వరకు ఇక్కడి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ తప్పనిసరిగా పూర్వవిద్యార్థుల సంఘంలో సభ్యత్వం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యుల ఆమోదం మేరకు సభ్యత్వ రుసుమును రూ.ఐదువేలు నిర్ణయించినట్లు వెల్లడించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న సిల్వర్ జూబ్లీ సంబరాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్పోర్ట్స్‌డేకు స్టార్ షట్లర్ పీవీ సింధు, మాజీ క్రికెట్ టీం కెప్టెన్ రాహుల్ ద్రావిడ్, టెన్నిస్ క్రీడాకారుడు రాఫెల్ నడాల్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తామన్నారు. అనంతపురంలో విశేష సేవలందించిన సీనియర్ వైద్యులందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఈ సంబరాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంబరాలను పురస్కరించుకుని ఫిబ్రవరి, మార్చి నెలల్లో మెడికల్ ఎగ్జిబిషన్స్ నిర్వహించడానికి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారామ్, డాక్టర్ మధుసూదన్, చైతన్య, నీలిమ చౌదరి, రమణనాయక్, శ్రీహర్ష, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, భీమసేనాచారి, శ్రీనివాసులు, శైలజ, స్వాతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ జాబితాలో అక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఎల్లన్న, నాగభూషణం తదితరులు

అనంతపురం సెంట్రల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల ఎంపిక జాబితాను అక్రమంగా రూపొందించారని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ మెంబర్ ఎల్లన్న, ఆర్ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం మండిపడ్డారు. ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేసిన వరలక్ష్మి సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ల నియామకంలో వసూళ్లకు పాల్పడి అనర్హులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు దక్కాల్సిన పోస్టులను అమ్ముకుని జాబితాను తయారుచేశారన్నారు. గత డీఈఓ వరలక్ష్మి ఎంపిక చేసిన జాబితాను రద్దుచేసి అర్హులైన రిజర్వేషన్ వర్గాల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

రామగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ వెంకటేశులు, దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, స్థానిక పెద్దలు రామ్మూర్తినాయుడు సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నాలుగు నెలల 17 రోజులకుగాను రూ.13,15,634 ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు.



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నియోజకవర్గాల సమస్యలు

పరిష్కరించండి

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి



మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ముఖ్యమంత్రి, పలువురు మంత్రులను కోరారు. అసెంబ్లీ ఆవరణంలో గురువారం వారు సీఎం చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రలను కలిసి వినతి పత్రం అందజేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని నడిమివంక రక్షణ గోడ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలో ప్రాజెక్టుల పనులను చేపట్టాలని కోరారు. పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు, గేట్ల మరమ్మతులు చేయించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 53 చెరువులకు నీరందించాలన్నారు. హెచ్చెల్సీ ద్వారా పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కాలవ నుంచి తాడిమర్రి మండలంలోని చివరి చెరువు వరకూ నీరు అందేలా చూడాలన్నారు. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు నిలిపివేశారని, ఈ ప్రాజెక్టు పరిధిలో రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి ప్రాజెక్టును నిర్మించాలని ఇరిగేషన్ మంత్రిని కోరారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాలు మంజూరు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరగా.. ఆయన వెంటనే సీఎండీకి ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పలు గ్రామాలు, ఎస్సీఎస్టీ కాలనీల్లో దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని తిరుమల దేవరస్వామి ఆలయం సముదాయంలోని దుర్గాదేవి ఆలయానికి మెట్ల ఏర్పాటు, రూ.50లక్షలతో స్నాక్‌బార్ మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమల దేవర వెంకటేశ్వరస్వామి ఆలయంలో పర్యాటక సౌకర్యాల అభివృద్ధి, ఎన్‌హెచ్ 44 అనంతపురం సమీపంలోని మరూరు టోల్‌గేట్ వద్ద రూ. 25 లక్షలతో స్నాక్ బార్ నిర్మాణం, ఆత్మకూరు జాతీయ రహదారి సమీపంలో టూరిజం వేసైడ్ సౌకర్యాలు, నసనకోట ముత్యాలమ్మ గుడి దగ్గర, చెన్నేకొత్తపల్లి మండలం సమీపంలోని కోన శివాలయం వద్ద పిల్లలు ఆడుకోవడానికి ప్లే ఏరియా, టూరిజం రెస్టారెంట్, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. పేరూరు డ్యాం వద్ద బోటింగ్ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేయగా... ఆయన సానుకూలంగా స్పందించారు. మరోవైపు భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కలిసి రామగిరి బంగారు గనులను మళ్లీ తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందిస్తూ... సంబంధిత శాఖల అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు తెలిపారు.

లస్సీ షాపులో రూ.లక్ష చోరీ

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ లస్సీ షాపులో రూ.లక్ష చోరీ అయ్యింది. నగరంలోని లాల్‌బాగ్ స్ట్రీట్‌లో చిన్న కుళ్లాయిస్వామి కుటుంబంతో నివాసముంటున్నాడు. కమలానగర్‌లో వినాయ క లస్సీ పాయింట్ పేరుతో ఓ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈనెల 19న రాత్రి 10గంటలకు షాపు మూసి వెళ్లారు. 20 ఉదయం దుకాణం తెరిచే ప్రయత్నంలోనే తాళాలు బద్దలు కొట్టినట్లు గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో ఉండాల్సిన రూ.లక్ష, ఒక మొబైల్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థిని అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని నేతాజీనగర్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని సుగుణ ఇంటి నుంచి అదృశ్యమైంది. బుధవారం ఉదయం స్కూల్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలలో ఆరా తీశారు. స్కూల్‌కు రాలేదని చెప్పడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వుల కొట్టివేత

అనంతపురం విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ ఎంపీడీఓ అమృత్‌రాజ్ డిస్మిస్ ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. దీంతో తనకు పోస్టింగ్ ఇవ్వాలంటూ గురువారం జడ్పీలోని అధికారులకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. గతంలో నిధుల దుర్వినియోగం, ఇతర ఆరోపణలపై గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నాయకులు, కొందరు ఉన్నతాధికారుల ఒత్తిళ్లవల్ల ఆయనను పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు డిస్మిస్ చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా తీర్పురావడంతో పోస్టింగ్ కోసం జడ్పీలో అధికారులను కలిశారు.

గ్రామీణ బాలికల క్రికెట్‌లో సెంచరీల మోత



తేజశ్రీ శర్మ, నందేశ్వరి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా బ్యాటర్లు సెంచరీల మోత మోగించారు. గురువారం జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తాధ్వర్యంలో రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. నార్పల అండర్-16, పెనుకొండ అండర్-16 బాలికల జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 30 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 379 పరుగులు చేసింది. బ్యాటర్ తేశ్రీ వర్మ 102 బంతుల్లో 35బౌండరీల సాయంతో 173 పరుగులు, నందేశ్వరి 111 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన పెనుకొండ 30ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 126పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. సెంచరీలు సాధించిన బ్యాటర్లకు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

లక్ష్యాలను వందశాతం సాధించాలి: కలెక్టరు

అనంతపురంటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆయాశాఖలకు కేటాయించిన ప్రభుత్వ పథకాల లక్ష్యాలను వందశాతం సాధించాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన గురువారం అధికారులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హౌసటుహౌ సజియోకోఆర్డినేట్స్ అప్డేట్ పెండింగ్ అనంతనగరంలో అధికంగా ఉందని దీనిని వేగవంతం చేయాలని నతరపాలక అధికారులను ఆదేశించారు. నగరపాలక పరిధిలో సచివాలయ సిబ్బంది కొరతతో పాటు మూడేళ్ల కిందట మ్యాపింగ్ జరిగిందని, ఎక్కువ వయసు ఉన్న వయోవృద్ధులు ఎక్కువ మందికి ఐరిష్, బయోమెట్రిక్ పనిచేయడంలేదని కమిషనర్ వివరించారు. ఇంకొందరు నెలమొదటిలో వచ్చి పింఛన్ తీసుకొని, ఆతర్వాత కనిపించకుండా పోతున్నా రని, అందుకే ఎక్కువ మ్యాపింగ్ చేయలేకపోతున్నామని తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పింఛన్లు ఇచ్చేరోజే డోర్‌టు డోర్ ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టరు ఆదేశించారు. మరణించిన వారిపేర్లు జాబితాలో ఉన్నాయని దీనిపై స్పష్టత తీసుకుందామని తెలిపారు. బ్రహ్మసముద్రం, కుందిర్పి, శెట్టూరు, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్‌లలో ప్రణాళిక వేసుకొని ప్రగతి సాధించాలని ఆదేశించారు.

• షోకాజ్ నోటీసు ఇవ్వండి

కలెక్టరు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు బెళుగుప్ప ఎంపీడీఓ గైర్హాజయ్యారు. దీనిపై జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. అధికారులు క్రమశిక్షణతో మెలగాలని ఈసందర్భంగా కలెక్టరు సూచించారు.

ఆర్ఆర్‌బీ పరీక్షకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ నియామకం కోసం నిర్వహించనున్న పరీక్ష కోసం జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు (నం. 07105) ఈనెల 23న నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6-25 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07106) తిరుపతిలో ఈనెల 24మధ్యాహ్నం 3-35 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8-25 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ముడ్‌ఖేడ్, ధర్మాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే హుబ్లీ-కర్నూలు ప్రత్యేక రైలు (నం. 07315) ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో హుబ్లీలో రాత్రి 8-15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు కర్నూలుకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07316) కర్నూలులో ఈనెల 25, 26, 27, 28 తేదీల్లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4-15 గంటలకు హుబ్లీకి చేరుకుంటుందన్నారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట, తోరణగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్ స్టేషన్ల మీదుగా ప్రయాణి స్తుందన్నారు. ఆర్ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయ తోటల్లో కేబుల్‌వైరు చోరీ



ఆదినారాయణరెడ్డి తోటలో కేబుల్ వైరు ఎత్తుకెళ్లిన దుండగులు

యాడికి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాలమడుగు గ్రామంలో బుధవారం రాత్రి కేబుల్ వైరు దొంగలు పేట్రేగిపోయారు. 8మంది రైతుల వ్యవసాయ బోరుబావుల కేబుల్‌వైరు చోరీ చేశారు. గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు, జయనాయుడు, రాజామనోహర్‌నాయుడు, చంద్రశేఖర్, ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, తిరుమలరెడ్డి, గోపాల్‌రెడ్డి అనే రైతుల తోటల్లో సుమారు 200మీటర్ల కేబుల్‌వైరును దుండగులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. దుండగుల ఆగడాలతో పంటలను ఎండబెట్టుకోవాల్సి వ స్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన కొందరు దుండగులు కేబుల్‌వైర్ల చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు తెలిపారు. దీనిపై పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సుధాకర్‌నాయుడు తోటలో...



రాజా మనోహర్ నాయుడు తోటలో, నరసింహారెడ్డి తోటలో..

కర్నూలుకు హైకోర్టు బెంచ్

- తీర్మానం ప్రవేశ పెట్టిన న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ
- రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రుల హర్షం
- ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ప్రభుత్వం లేఖ
- ప్రజాగళం సభలో చంద్రబాబు హామీ
- ఐదు నెలల్లోనే అమలుకు శ్రీకారం
- ఐదేళ్లపాటు నాన్చిన జగన్ ప్రభుత్వం


కర్నూలు జిల్లా కోర్టు

కర్నూలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఇప్పటికే అభిప్రాయం కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ రాశారు. ఈక్రమంలోనే బుధవారం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం తీర్మానం ప్రవేశ పెట్టగా శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాయలసీమ ఎమ్మెల్యేలు, మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా చేసి, హైకోర్టు ఏర్పాటు చేస్తామని సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టారు. అయితే ఎన్నికల ముందు ప్రజాగళం సభలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన ఐదు నెలలకే అమలు దిశగా అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ తీర్మానంపై రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ


కర్నూలులో హైకోర్టు అంటూ వైసీపీ రాజకీయ స్వలాభం కోసం ఐదేళ్లు మభ్యపెట్టారు. మరోవైపు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమి మంగళగిరిలో ఏర్పాటుకు సంబంధించి జీవో ఇచ్చారు. 2022 డిసెంబరు 5న కర్నూలు నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో వైసీపీ నిర్వహించిన సీమ గర్జన సభలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్నూలును న్యాయ రాజధానిగా మారుస్తాం.. హైకోర్టు ఏర్పాటు చేస్తాం అంటూ పదేపదే ఉపన్యాసాలు ఇచ్చారు. బుగ్గన ఓ అడుగు ముందుకేసి కర్నూలు నగరానికి నాలుగు వైపులా 25 కిలోమీటర్ల దూరంలో కనిపించేలా జగన్నాథగట్టుపై అందమైన హైకోర్టు భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. మాయ చేశారే తప్పా అమలుకు చర్యలు చేపట్టలేదు.

ఐదు నెలల్లోనే...

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల్లో అప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి.. వైసీపీ అధికారం చేపట్టింది. అయినా చంద్రబాబు మాట మార్చలేదు. అదే హామీకి కట్టుబడి నిలబడ్డారు. గత ఎన్నికల్లో అధికార వైసీపీ నేతలు, సీఎం జగన్ కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తే.. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు 'హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ఆ ప్రక్రియ మొదలు పెడుతాం..' అంటూ ప్రజాగళం సభలో స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేసింది. హైకోర్టు అభిప్రాయం కోరుతూ గత నెల 28న లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీత గత నెల 28న లేఖ నంబరు.2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. ఆ వెంటనే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో ఆమోదం, గురువారం శాసనసభ, మండలిలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ చర్యలో పాల్గొన్న రాయలసీమ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేల హర్షం వ్యక్తం చేశారు.

సాకారం దిశగా 87 ఏళ్ల స్వప్నం

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు 87 ఏళ్ల స్వప్నం. బెంచ్ రూపంలో సాకారం కాబోతుందని రాయలసీమ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహంలో శ్రీబాగ్ భవనంలో జరిగిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రతినిధుల సమావేశంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందమే 'శ్రీబాగ్ ఒడంబడిక'. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుతో కర్నూలు కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసినా నాలుగేళ్ల ముచ్చటగానే ముగిసింది. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో రాజధాని హైదరాబాద్‌కు తరలిపోయింది. అయితే.. సీమ ప్రజల మదిలో శ్రీబాగ్ ఒడంబడిక అంశాలు చెదిరిపోలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.


కర్నూలు కొండారెడ్డి బురుజు

వైసీపీ మాట తప్పింది.. మడమ తిప్పింది..


సవిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా

వైసీపీ ప్రభుత్వ హయాంలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని పాలాభిషేకాలు చేయించుకున్నారు. మాట తప్పం.. మడమ తిప్పం అన్నారు. మాట తప్పి మడత తిప్పి రాయలసీమ ద్రోహిగా జగన్ నిలిచారు. చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం అభినందనీయం.

మాట నిలబెట్టుకున్న బాబు..


పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రివర్గంలో తీర్మానం చేయడం, మండలిలో బిల్లు ప్రవేశపెట్టడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. గత ఎన్నికలకు ముందు ప్రజాగళం సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని, ఆ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కసరత్తులు మొదలు పెట్టిందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాసినందుకు ఆమె ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

బెంచ్ ఏర్పాటు హర్షణీయం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయమని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సమయంలో కాలవ శ్రీనివాసులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీమ బిడ్డగా రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నందుకు తనకు గర్వంగా ఉందన్నారు. దశాబ్దాల కాలంగా రాయలసీమ ప్రజలు, ముఖ్యంగా సీనియర్ న్యాయవాదులు కోరుకుంటున్న హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటం శుభపరిణామమన్నారు. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబునాయుడు రాయలసీమలో హైకోర్టు బెంచ్‌కు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు తొలి అడుగు వేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో న్యాయ రాజధాని కర్నూలులో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామని చెప్పి రాయలసీమ ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. అప్పటి 22 మంది వైసీపీ ఎంపీలు హైకోర్టు ఏర్పాటుపై ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన దాఖలాలు లేవన్నారు.

జగన్‌ది మోసం

ఒకవైపు జగన్మోహన్‌రెడ్డి న్యాయ రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేస్తానని ప్రకటనలు ఇస్తుండగానే అదే ప్రభుత్వం ఏపీ జుడీషియల్ అకాడమీని మంగళగిరిలో స్థాపిస్తున్నట్లు జీవో ఇవ్వడం మోసమేనన్నారు. జుడీషియల్ అకాడమీ మంగళగిరిలో ఏర్పాటైన విషయంపై రాయలసీమ ప్రజలందరూ అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. కర్నూలులో హై కోర్టు బెంచ్ పెట్టే ఆలోచన గతంలో ఉండేదని, ప్రస్తుతం ఆ ఆలోచన విరమించుకుంటున్నట్లు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2022 నవంబరు 28న సుప్రీంకోర్టుకు తెలిపిందని కాలవ గుర్తు చేశారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుచేసే ఆలోచన ఏ మాత్రం లేదని స్వయంగా జగన్మోహన్‌రెడ్డి సుప్రీంకోర్టుకు విన్నవించడం ద్వారా రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయాడన్నారు. చంద్రబాబునాయుడు ప్రజాగళంలో ఇచ్చిన మాటకు కట్టుబడి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు.

అలరించిన సంగీత కచేరి

- 25 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- కొనసాగుతున్న సత్యసాయి జయంత్యుత్సవాలు


పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో సేవాసంస్థల యువత సంగీత కచేరి భక్తులను అలరింపజేసింది. సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల నాలుగోరోజుసేవాసంస్థల సదస్సు కొనసాగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలను ఆలపించారు. అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు, ప్రేమే దైవం పేరిట భక్తిపాటలతో అలరింపజేశారు.

25 మందికి బంగారు పతకాలు

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన 25 మంది విద్యార్థులకు శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి బంగారు పతకాలను ప్రదానం చేశారు. 2017 నుంచి దక్షిణ భారత దేశంలోని పలురాష్ట్రాల్లో పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో సేవాసంస్థలు పోటీలను నిర్వహించాయి. తెలుగు రాష్ట్రాల్లోని 5517 కాలేజీలు, పాఠశాలల్లో పోటీలు పెట్టారు. 2.72 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 20 మంది విద్యార్థినులు, ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి సాయికుల్వంత్ వేదికగా చక్రవర్తి బంగారు పతకాలను ప్రదానం చేశారు.


పతకం ప్రదానం చేస్తున్న ట్రస్టు సభ్యుడు చక్రవర్తి

భక్తి పారవశ్యం

సాయికుల్వంత్ మందిరంలో సాయంత్రం సగీత కచేరి నిర్వహించారు. భక్తిగీతాలతో అలరింపజేశారు. ఈ సందర్భంగా సాయికుల్వంత్ సభామందిరాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు డాక్టర్ మోహన్, సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే పాల్గొన్నారు.

విలువల విద్యాలయం

- నేడు శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం


యూనివర్సిటీ

పుట్టపర్తి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): విలువలు కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సత్యసాయి విద్యావిధానం కొనసాగుతోంది. బాబా స్థాపించిన చిన్న విద్యాసంస్థ డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. క్రమశిక్షణ, ఆధ్యాత్మికత, విలువలతో కూడిన విద్యను ఉచితంగా అందిస్తున్నారు. అలాంటి విలువల విశ్వవిద్యాలయ 43వ స్నాతకోత్సవం శుక్రవారం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఘనంగా నిర్వహించనున్నారు. యూఎస్ జాతీయ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతు రామన్ పంచనాథన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభ కనబరచిన 22 మందికి బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. 14 మందికి పీహెచ్‌డీలు అందజేస్తారు. ఇందుకోసం సాయికుల్వంత్ మందిరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

చిన్న సంస్థతో మొదలు..

సత్యసాయిబాబా ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అదేస్థాయిలో ఆధ్యాత్మికత, విలువలతో కూడిన విద్యను అందించడానికి 8 దశాబ్దాల క్రితమే శ్రీకారం చుట్టారు. 1962లో ప్రారంభించిన చిన్నపాటి విద్యాసంస్థ ప్రస్తుతం యూనివర్సిటీ స్థాయికి చేరింది. 1981 నవంబరు 22న స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన శ్రీసత్య సాయి యూనివర్సిటీని సత్యసాయిబాబా స్థాపించారు. ఆ తరువాత ప్రాథమిక విద్య నుంచి పీహెచ్‌డీ స్థాయివరకు శాస్త్రసాంకేతికత, విలువలతో కూడిన విద్య అందిస్తూ వచ్చారు. వేలమంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

రెండు రాష్ట్రాల్లో విద్య

సత్యసాయి విలువలతో కూడిన విద్యను తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రంలో సైతం విస్తరించారు. ఏపీలో ప్రశాంతినిలయం, అనంతపురం మహిళా క్యాంపస్, కర్ణాటకలోని బెంగళూరు బృందావనం క్యాంపస్, చిక్‌బళాపురం వద్ద ఉన్న ముద్దనహళ్లి క్యాంపస్ ద్వారా విద్య అందిస్తున్నారు. ప్రశాంతి నిలయంలోని యూనివర్సిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు నడుస్తున్నాయి. భారత్‌లోనే కాక విదేశాల్లో సైతం సత్యసాయివిలువల విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

అందరికీ ఉచితం

నేడు ఉన్నత చదువులు చదవాలంటే రూ.లక్షలు ఖర్చు పెట్టుకోవాల్సిందే. దశాబ్దాల క్రితమే సత్యసాయిబాబా విలువలు, ఆధ్యాత్మికతతో కూడిన విద్యను అందరికీ ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారు. నేటికీ నిరంతరాయంగా ఉచిత విద్య కొనసాగుతోంది. క్రమశిక్షణ, ప్రేమ వాతావరణంలో ఆధ్యాత్మికతతో కూడిన విద్యను అందిస్తున్నారు. విద్యార్థుల్లో స్వావలంబన, సామాజిక సేవస్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఉన్నతస్థానంలో నిలిపేందుకు సత్యసాయి విద్యావిధానం అన్నివిధాలా తోడ్పడుతుందన్నది అక్షరసత్యం. మహిళా విద్యను ప్రోత్సహించడానికి అనంతపురంలో ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేశారు. పీజీ, పీహెచ్‌డీ వరకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

నేడు పుట్టపర్తికి గవర్నర్ రాక

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పుట్టపర్తిటౌన్/రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం రాత్రి రానున్నారు. గవర్నర్ విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి పుట్టపర్తి చేరుకుంటారని కలెక్టర్ చేతన్ తెలిపారు. 23న సత్యసాయిబాబా జయంత్యుత్సవాల్లో పాల్గొంటారన్నారు. గవర్నర్ పర్యటన ఖరారవడంతో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని యంత్రాంగాన్ని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న ఆదేశించారు. వారు గురువారం గవర్నర్ పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. గవర్నర్ బసచేసే సాయి శ్రీ నివాస్ అతిథిగృహం, సాయికుల్వంత్ సభామండపం, పూర్ణచంద్ర ఆడిటోరియం ప్రాంతాలను పరిశీలించారు. సూచిక బోర్డులు ప్రదర్శించాలని ఆర్డీఓ సువర్ణను ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీతోపాటు డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, తహసీల్దార్ అనుపమ, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.


గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఇక 30 అడుగుల రోడ్డు చాలు

- అహుడా నిబంధనల్లో మార్పు..? ● త్వరలో ఉత్తర్వులు

అనంతపురం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం-హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో కొత్త నిబంధనలు అమలులోకి వస్తాయని తెలిసింది. అహుడా పరిధిలో వేసే వెంచర్‌లలో 40 అడుగుల రోడ్డు ఉండాలనే నిబంధన ఉంది. దీన్ని 30 అడుగులకు కుదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు అనుమతులకు సంబంధించి కొన్ని నిబంధనలు మారుతాయని తెలిసింది. వీటికి సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వస్తాయని అహుడా అధికారవర్గాలు తెలిపాయి. అహుడాలో పరిధిలో ఎన్నో వెంచర్లను అనధికారికంగా వేశారు. వైసీపీ ప్రభుత్వం లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) విషయంలో అలసత్వం ప్రదర్శించింది. క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎంతో మంది ఎదురుచూస్తున్నారు.



స్తంభించిన వెబ్‌సైట్

కొన్ని రోజులుగా అహుడా వెబ్‌సైట్ స్తంభించింది. ఆన్‌లైన్‌లో జరిగే అప్రూవల్స్, లే అవుట్ల ఫైల్స్ పరిశీలన ప్రక్రియకు బ్రేక్ పడింది. నెలరోజులుగా ఈ పరిస్థితి కొనసాగుతోంది. మధ్యలో కొన్ని రోజులు వెబ్‌సైట్ పనిచేసినా, కొన్ని గంటలకే పరిమితమైంది. దీంతో అహుడా కార్యాలయానికి వచ్చే వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

న్యూస్‌బాక్స్

పది విద్యార్థులు మాధ్యమం ఎంచుకోవచ్చు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు 2025లో నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియం ఎంచుకునే అవకాశం ఉందన్నారు. 8, 9 తరగతులను ఆంగ్లమాధ్యమంలో చదివి ఉండుంటే అదే మీడియంకు ప్రాధాన్యత ఇచ్చుకోవచ్చన్నారు. తెలుగు మీడియం చదివిన వారు ఇంగ్లిష్, తెలుగు ఏదైనా ఎంచుకోవచ్చన్నారు. పాఠశాల హెచ్ఎం, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకుడికి మాత్రమే మాధ్యమాన్ని మార్చే వీలుంటుందన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన వారు ఇంగ్లిష్ మీడియం ఎంచుకుని ఉండుంటే 25వ తేదీలోగా మార్చుకోవచ్చని ఆయన ప్రకటనలో వివరించారు.

టమోటా కిలో రూ.28

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 28తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.39 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.39,200 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12వేలు, సరాసరి రూ. 23,800తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 62 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.648 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.648 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. అలాగే రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1132 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 722 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

24న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 24న ఉదయం 8గంటలకు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 6 నుంచి 9 వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే 10వ ఏపీ సీనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు క్రీడా సామగ్రి, యూనిఫాం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9393711324ను సంప్రదించాలని కోరారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు...

జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ బాల, బాలిక క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 24న అనంతపూర్ క్లబ్‌లోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-15, సీనియర్ బాల, బాలికల కేటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు మొదటి వారంలో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9440289940ను సంప్రదించాలని కోరారు.

24న వాల్మీకుల కార్తీక వనభోజన మహోత్సవం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా వాల్మీకి గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న నగర శివారులో ఉన్న నాగిరెడ్డి పల్లి గార్డెన్స్‌లో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధి ఈశ్వర్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న వాల్మీకి గెజిటెడ్ ఆఫీసర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 8179192331ను సంప్రదించాలని కోరారు.

నేడు పూల నాగరాజు ప్రమాణ స్వీకారం

అనంతపురం కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా నియమితుడైన పూల నాగరాజు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అనంతపురం బస్టాండుపై ఉన్న ఆయన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా కడప జోనల్ చైర్మన్‌గా పూల నాగరాజును నియమించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఈడీ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరవనున్నట్లు సమాచారం.

సూపర్ సేవలు



- పేదలపాలిట వరం.. శ్రీసత్యసాయి సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి
- ఉచితంగా అధునాతన వైద్యం
- మత, కుల, ప్రాంతం, దేశాలకు అతీతంగా సేవలు
- నేటితో 33 వసంతాలు పూర్తి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



మోకాలికి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

పుట్టపర్తిరూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పేద, ధనిక, కుల, మత, ప్రాంతం, దేశం అనే వివక్ష లేకుండా అందరికీ ఉచితంగా.. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని శ్రీసత్యసాయి బాబా సంకల్పంతో ఏర్పాటైందే పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి. తన మాతృమూర్తి ఈశ్వరాంబ కోరిక మేరకు 1956లో పుట్టపర్తిలో సత్యసాయి జనరల్ హాస్పిటల్ స్థాపించారు. దీనిలో సేవలు ప్రారంభించి శుక్రవారంతో 33 వసంతాలు పూర్తి అవుతోంది. రోజురోజుకూ ఇందులో వైద్య సేవలను విస్తరిస్తున్నారు. స్థానికులకే కాదు.. ఆర్థిక స్థోమత లేని అనేక రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రజలు ఈ ఆస్పత్రి ద్వారా ఆధునిక వైద్య సేవలను.. పూర్తిగా ఉచితంగా పొందుతున్నారు.

● దక్షణాసియాలోనే అతిపెద్దది.. దక్షణాసియాలోనే అతిపెద్ద సూపర్ హాస్పిటల్ ఇది. ఇక్కడ గుండె, కన్ను, యురాలజీ, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ తదితర జబ్బులకు ఉచితంగా వైద్యసేవలందిస్తారు. నాటి భారత ప్రధాని పీవీ నరసింహారావు చేతుల మీదుగా 1991 నవంబరు 22న శ్రీసత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరిట ఆసుపత్రిని సత్యసాయి బాబా ప్రారంభించారు. నాటి నుంచి ఆస్పత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యసేవలు ఉచితంగా నిరుపేదలకు అందిస్తున్నారు.

● దేవాలయాన్ని తలపించేలా 110 ఎకరాల్లో రూ 300 కోట్లతో ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని తొమ్మిది నెలల్లో పూర్తి చేసి.. ప్రారంభించారు. నాటి నుంచి అందులో శస్త్రచికిత్సలు మొదలుపెట్టారు. ఈ ఆస్పత్రి లో వాతావరణం ప్రశాంతంగా.. ఆహ్లాదకరంగా ఉంటూ ఒక దేవాలయంలో ఉన్నట్లు అగుపిస్తుంది. ఇక్కడ వైద్యసేవలకు వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని భాషలకు సంబంధించిన తర్జుమా చేసేవారు అందుబాటులో ఉండటం విశేషం.



ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్ (ఫైల్)

న్యూస్ బాక్స్...

సమస్యలకు పరిష్కారం ఏదీ..?

తనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో ఫిర్యాదు చేసిన ఏ సమస్యలనూ అధికారులు పరిష్కరించడం లేదని, అలాంటప్పుడు ఈ గ్రామసభలను నిర్వహించడం ఎందుకని మండల కాంగ్రెస్ కన్వీనర్ తోపు పారేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మండలంలోని చీకటిమానుపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు గురువారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకుని భూమిని చదును చేసి ఏళ్ల తరబడి సాగుచేస్తున్నా.. అధికారులు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. ఎస్సీ శ్మశాన వాటికల కోసం ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇళ్లులేని నిరుపేదలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని, ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసందానం చేయాలని అన్నారు.

పాఠశాలల పనివేళల పెంపు తగదు

కొత్తచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉన్నత పాఠశాలల పనివేళలు పెంచడం తగదని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌చంద్ర అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక విద్యాశాఖ ఏడీ-2 రామకృష్ణకు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. పాఠశాల పనిగంటల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని.. లేకపోతే ఉపాధ్యాయ సంఘాల ద్వారా నిరసనలు తెలియ జేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు జయరాం, సాయిశివ, వెంకటరమణనా యక్, శంకర, గంగాదర్, సేవేనాయక్, చంద్రశేఖర్, చెన్నకేశవులు, మురళి పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: పాఠశాల పనివేళల మార్పుపై ప్రభుత్వం పునరాలోచించాలని ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎజ్యుకేషన్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లస్కర్ నాయక్ ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం అనుసరిస్తున్న పనిసమయం సరైందన్నారు. ఇది గ్రామీణ విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల వరకు పెంపు నిర్ణయం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుదన్నారు. గ్రామీణ విద్యార్థులకు రవాణాకు ఇబ్బంది అవుతుందన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గాండ్లపెంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెక్కమాను ఉన్నత పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు కుచ్చెపు శ్రీనివాసులు రూ. 12 వేల విలువైన విద్యాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను ఉపాధ్యాయుడికి విధులను స్వీకరించి 15 సంవత్సరాలు అయిందని, ఇలా ఏటా తాను విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్ణానాయక్, హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా ఖాతాల కోసం ప్రత్యేక శిబిరాలు

ధర్మవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయంలో కొత్తగా ఖాతాలను తెరవడం కోసం ప్రత్యేక శిబిరాలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు కొత్తపేట పోస్టుమాస్టర్ రహీమున్నీషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాలను ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

ఎస్‌ఐగా ఇషాక్ బాషా



ముదిగుబ్బ, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండల ఎస్‌ఐగా ఇషాక్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో నుంచి బదిలీపై ఆయన వచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత మొదటి ఎస్‌ఐగా ఇతన్ని నియమించారు.

సెల్‌ఫోన్‌తో అనర్థాలపై అవగాహన

తాడిమర్రి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను అతిగా వినియోగించడం ద్వారా జరిగే అనర్థాలపై స్థానిక ఎస్‌ఐ క్రిష్ణవేణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలోని నిర్వహించిన సమావేశంలో వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు రమేశ్, విష్ణు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యత తనిఖీ

కదిరి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిపల్లి, కదిరి కుంట్లపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతను పంచాయతీ రాజ్ ఈఈ మల్లికార్జున గురువారం పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఆయన వెంట పీఆర్ డీఈ మధుసూదన్, ఏఈ గురురాజుగుప్త ఉన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ, పంచాయతీ కార్మికులు

ముదిగుబ్బ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ముదిగుబ్బ మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ.... పంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు 2016 నుంచి ఆర్డర్ కాపీ ఇవ్వడంలేదని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి దహన సంస్కారాలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేశ్, అవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, టైలర్ మస్తాన్, రఫీ, నౌషాద్, కార్మికులు ఆదినారాయణ, ఓబులేశు, సావిత్రి, హరి పాల్గొన్నారు.

మరుగుదొడ్లపై అవగాహన

నంబులపూలకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మరుగుదోడ్ల దినోత్సవం నేపథ్యంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాగలకట్ల సమీపంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీడీఓ ఆంజనప్ప మాట్లాడుతూ.. ఇంటిలో మరుగుదొడ్లు లేనివారు దరఖాస్తు చేస్తుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శిరీషా, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నల్లచెరువు : స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు గురు వారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఇందులో ఈఓఆర్డీ శకుంతలబాయి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఎంఈఓ రమణానాయక్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, పీఈటీ గోపీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..!



ప్రధాన రహదారిపై ఒరిగిన విద్యుత్ స్తంభం

ఓబుళదేవరచెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కదిరి, హిందూపురం రహదారి హోండా షోరూం సమీపంలో రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. దీంతో ఎప్పుడు .. ఏ ప్రమాదం జరుగుతుందో... అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సచివాలయం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు రక్షణ కంచెను ఏర్పాటు చేయలేదు. ప్రతి బుధవారం వారపు సంత ఈ ప్రాంతంలోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయాలని, ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సచివాలయం వద్ద రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన

బత్తలపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్రాచెరువు సమీపంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థలాన్ని ఆర్డీఓ మహేష్ గురువారం పరిశీలించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 50 ఎకరాలు అవసరం కావడంతో.. అధికారులు భూసేకరణ కోసం తీవ్రంగా యత్నిస్తున్నారు. అందులో భాగంగా అప్రాచెరువు సమీపంలో స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ.. నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. ఆయన వెంట మండల సర్వేర్ జోసఫ్, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేర్లు ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



హైందవి

బుక్కపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న హైందవి రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈనెల 16, 17, 18 తేదీల్లో గుడివాడలో జరిగిన అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ 82, 86 కేజీల కేటగిరిలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పాల్గొన్న హైందవి రన్నరప్‌గా నిలిచింది. హైందవీని హెచ్‌ఎం వనజాక్షి, పీడీ ఉషారాణి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

బాల్‌బాడ్మింటన్ పోటీల్లో...



పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

పుట్టపర్తి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అండర్-19 స్కూల్ గేమ్స్ బాల్ బాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని ఎనుమలపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈనెల 9, 10వ తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన అండర్-19 బాలికల విభాగంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బాలుర విభాగంలో అనంత జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ప్రతిభ చాటిన సాయిస్వరూప, నందిని, హర్షిత, సాయి చంద్రను ఆ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, పీడీ రమేష్ బాబు గురవారం అభినందించారు.

విదేశీ భక్తుల అన్నదానం

నల్లమాడ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డిబాబా ఆలయంలో సత్యసాయి బాబా విదేశీ భక్తులు గురువారం 500 మందికి అన్నదానం చేశారు. 200 మంది పేద మహిళలకు చీరలు అందించారు. వారు మాట్లాడుతూ.. బాబా జన్మదినం సందర్భంగా ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బాబా సన్నిధిలో సేవచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.



అన్నదానం చేస్తున్న సాయిబాబా విదేశీ భక్తులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

శిక్షణ శిబిరం

పుట్టపర్తి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలతో జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కిశోర బాలికల వికాసంపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ... పిల్లలకు నైతిక విలువల గురించి తల్లిదండ్రులు చెప్పడం లేదన్నారు. పాఠశాల స్థాయిలోనే చదువు విలువల గురించి ప్లిలలకు చెప్పితేవారు బాధ్యతగల పౌరులుగా ఎదుగుతారన్నారు. ఐసీడీఎస్ అధికారి సుధావరలక్ష్మి మాట్లాడుతూ.. పిల్లలు విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్యవివాహాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బాలికల వికాసంపై పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసాయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, రీసోర్సు పర్సన్లు, డీఆర్డీఓ అధికారి నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అధ్యాపకులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి

నల్లమాడ నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. వీధిదీపాలు లేక పోవడంతో రాత్రి వేళల్లో ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతు న్నారన్నారు. అంతే కాకుండా మురుగునీటి కాలువలు లేక నీరు రోడ్లపై పారుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిదీపాలు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట నాగేంద్ర, గంగాద్రి, మహేష్, రమణ, రామప్ప, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి ఉన్నారు.

ప్రహ్లాదుడి దర్శనానికీ అవకాశం కల్పించాలి

కదిరి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రహ్లాదుడి సమేతంగా దర్శనం భాగ్యం కల్పించాలి రాయల్ పీపుల్స్ ఫ్రెంట్ జిల్లా కన్వీనర్ కుటాల లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయం గర్భగుడిలో ఒకవైపు నరసింహ స్వామిని, మరోవైపు ప్రహ్లాదుడిని ప్రతిష్ఠించారన్నారు. దర్శనం కోసం వచ్చే భక్తులు ప్రహ్లాదుడి సమేతంగా స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. అయితే కరోనా సమయంలో గర్భగుడి వెలుపల నుంచే దర్శనం కల్పిస్తున్నారు. దీంతో ప్రహ్లాద సమేతంగా స్వామి దర్శనం లభించకపోవడంతో భక్తులు అసంతృప్తిగా వెళ్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు శ్రీవారిని ప్రహ్లాదుడి సమేతంగా దర్శన భాగ్యం కల్పించాలని కోరారు. అలాగే కోనేరు పనులు త్వరగా పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తేవాలని కోరారు.

క్రైం న్యూస్ ..

మహిళకు పాముకాటు

ధర్మవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీ చెన్నకేశవపురానికి చెందిన లక్ష్మమ్మ గురువారం పాముకాటుకు గురైంది. ఆమె ప్రియాంకనగర్ సమీపంలోని చెరువులోని బట్టలు ఉతుకుతుండగా.. పాముకాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

డ్రిప్ పరికరాల చోరీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగలూరు గ్రామంలో రైతులు శ్రీనివాసులు, వెంకటనర్సు పొలాల్లోని బోరు వద్ద డ్రిప్ పరికరాలు బుధవారం రాత్రి చోరీ అయ్యాయి. ఒక్కొక్కరు రెండు ఎకరాల చొప్పన బోరు బావికింద వేరుశ నగ సాగుచేశారు. బుధవారం సాయంత్రం పంటలకు డ్రిప్ ద్వారా నీరు అందించి ఇంటికొచ్చారు. గురువారం ఉదయం పొలం వద్దకువెళ్లి చూడగా ఇరువురి డ్రిప్‌ల పరికరాలూ చోరీకి గురైనట్లు చెప్పారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

తనకల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుగుండు తండాల్లో ఓ మహిళ వద్ద ఉన్న 40 కర్ణాటక మద్యం బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ సీఐ మారుతిరావు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ జిలాన్‌బాషా, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, పోలీసులు శిరీషా, విఠల్‌పాండె, రామాంజనేయులు పాల్గొన్నట్లు చెప్పారు.



తారు రోడ్డు వేస్తున్న సిబ్బంది

వేమన ఆలయ రహదారికి మోక్షం

గాండ్లపెంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి క్రాస్ నుంచి కటారుపల్లిలో వేమన ఆలయం వరకు తార్ రోడ్డు నిర్మాణాల పనులను ప్రారంభించారు. 2004లో కటారుపల్లి క్రాస్ నుంచి కటారుపల్లి వరకు ఈ తార్ రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఈ రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారన్నారు. అప్పట్లో సింగల్ రోడ్డు మాత్రమే వేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే డబల్ రోడ్డు వేసేలా చర్యలు చేపట్టింది. దీంతో గ్రామస్థులు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చేనేత కార్మికులకు సబ్సిడీతో పనిముట్లు



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు 90శాతం సబ్సిడీతో వారికి అవసరమైన పనిముట్లను అందజేయనున్నట్లు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ మంత్రి మాట్లాడుతూ 2015ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఆసరాగా ఉండేలా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పార్కు ఉండేలా ఏర్పాటుకు నిర్ణయించారు. 90ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల మాదిరిగానే చేనేత రంగం కూడా పూర్తీ నిర్వీర్యం అయిందన్నారు. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కుకోసం కేటాయించిన భూములను పేదల ఇళ్లకు కేటాయించారన్నారు. కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చి పార్కు భూములు కాపాడామన్నారు. త్వరలోనే టెక్స్‌టైల్ పాలసీ తీసుకురాబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి లక్ష్యంతో ముందుకెళ్తున్నారన్నారు. ఆదిత్య బిర్ల గ్రూప్‌వంటి సమస్యల సహాయంతో పలుచోట్ల వీవర్స్ శాలలు, క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి నేతన్నల సంక్షేమానికి నిధులు కూడా తీసుకురాబోతున్నట్లు తెలిపారు. చేనేత రంగానికి, నేతన్నకు ఎన్డీఏ ప్రభుత్వంలో పూర్వవైభవం తీసుకురానుందన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

సోమందేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నక్కలుగట్ట కాలనీలో వీధి కుక్కల దాడిలో గాయపడి మృతిచెందిన వానరానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో వానరాన్ని తీసుకెళ్లి ఖననం చేశారు. జంతువుల పట్ల మానవత్వాన్ని చాటుకున్న కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

క్రికెట్ పోటీలకు బసవనపల్లి విద్యార్థిని



మహమ్మది

హిందూపురం అర్బన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసవనపల్లి పాఠశాల విద్యార్థిని మహమ్మది రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఫణిరాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అరుణలు పేర్కొన్నారు. ఈనెల 17న అనంతపురంలో జరిగిన అండర్ 17 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయిందన్నారు. డిసెంబరులో మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మహమ్మది పాల్గొంటుందన్నారు. క్రీడాకారిణిని పలువురు అభినందించారు

ఉపాధి పనులపై గ్రామసభలు

పెనుకొండ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ నరేష్‌కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పథకం కింద గ్రామాల్లో గ్రామస్థులు, కూలీలతో సమావేశం నిర్వహించి గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. గుట్టూరు గ్రామంలో రైతుల పొలాల్లో ట్రెంచ్ పనులు, సరిహద్దు కందకాలు, ఫారంపాండ్స్ కొండల చుట్టూ ట్రెంచ్ పనులు డ్రైన్లు, ఏర్పాటు చేయాలని, గ్రామసభలో కోరారు. పై అధికారులకు నివేదికలు పంపుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జయమ్మ, గ్రామస్థులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌లకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేటీ శ్రీధర్

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సౌజన్యంతో సేవామందిరం సంస్థ ఆధ్వర్యంలో గురువారం సేవామందిరం సంస్థ ప్రాంగణంలో ఎలక్ట్రీషన్ 15రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం గురించి సంస్థ అధ్యక్షులు కేటీ శ్రీధర్ మాట్లాడుతూ శిక్షణ తీసుకోవడం ద్వారా మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని శిక్షణ అనంతరం ఎలక్ట్రికల్ కిట్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, సంస్థ కార్యదర్శి రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, ఎంపీటీసీ రామాంజినేయులు, 20మంది శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

హిందూపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అండర్ 16 రాష్ట్రస్థాయి బాలబాలికల త్రోబాల్ పోటీలకు పలువురు ఎంపికైనట్లు సత్యసాయి జిల్లా త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్‌బాబు పేర్కొన్నాడు. గురువారం పట్టణ పరిధిలోని ఎంజీఎం ఆటల మైదానంలో రాష్ట్రస్థాయికి ఎంపిక చేపట్టారు. ఇందులో బాలుర విభాగం నుంచి ఏసువర్ధన్, దర్శన్, ప్రభాస్ ఈశ్వర్, బాలికల విభాగంలో షిఫా అంజుమ్, ప్రణీత, భవ్యశ్రీలు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 24న గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీఎస్ ప్రభుకుమార్, పాఠశాల ఇన్‌చార్జు హెచ్ఎం రమణ, పిడి లోకనాథ్, సీనియర్ క్రీడాకారులు సలీమ్ తదితరులు అభినందించారు.

భక్తరహళ్లి నారసింహుడికి పంగనామం



- ఆదాయం రూ.70లక్షలున్నా సౌకర్యాలు శూన్యం
- ఆలయానికి గుంతల రోడ్డే గతి
- భక్తులకు మరుగుదొడ్లు కూడా కరువు
- తప్పని తిప్పలు

మడకశిర రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎవరైనా భూతాలు వదిలించుకోవడానికి భూతనాథుడైన భక్తరహళ్లి నరసింహస్వామి దగ్గరకు వస్తారు. కాని ఆ భూతప్పల అధినేతకే నేడు అధికారుల రూపంలో భూతం పట్టుకుంది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్ల శని అన్నట్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని భక్తరహళ్లి నరసంహస్వామి, జిల్లేడగుంట అంజనేయస్వామి ఆలయాల పరిస్థితి తయారైంది. ఈ ఆలయాలు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధిచెందాయి. ఆదాయం కూడా గణనీయంగా ఉంటుంది. అయినా అభివృద్ధికి మాత్రం నోచుకోవడంలేదని భక్తులు వాపోతున్నారు. స్వామివారి దర్శనానికి ఏపీ నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడులలో నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో పదిరోజులపాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మూడు లక్షలకుపైగా భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. యేడాదికి మూడు సార్లు స్వామివారి హుండీ లెక్కింపులు జరుగుతాయి. రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు హుండీ ఆదాయం వస్తోంది. ఈ సొమ్మంతా ఏమవుతుందో తెలియడంలేదంటున్నారు భక్తులు.

దారిలేకుంటే భక్తులు ఎలా వస్తారు?

మడకశిర నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ భక్తరహళ్లి గ్రామానికి వేళ్లే మూడు కిలోమీటర్ల రహదారి గుంతలమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆలయాలకు వచ్చే భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం లేదు. తలనీలాలు ఇచ్చిన భక్తులకు స్నానగదులులేవు. మరుగుదొడ్లు అంతకుముందే లేవు. దూరప్రాంతాల భక్తులకు వసతులు లేకపోవడంతో వారు పడేబాధలు అన్నీ ఇన్నీకావు.

ఎక్కడాలేని భూతప్పల మండపం

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ భూతప్పల ఉత్సవం జరుగుతుంది. ఆరోజు అనువంశికంగా ఓ భక్తుడిపైకి నరసింహస్వామి ఆవహిస్తారు. ఆయన స్వామివారి డాలు కత్తితీసుకుని వరపడిన భక్తులపై నుంచి నడిచి వెళతారు. వారి కాలు తగిలితే తమ కోర్కెలు తీరతాయని భక్తులు విశ్వసిస్తారు.

ఉత్సవం పూర్తయ్యేంతవరకూ ఎవరూ కనీసం ఎంగిలి గంగకూడా మింగకుండా నియమనిష్టలతో ఉంటారు. ఇంత ప్రాచుర్యం కలిగిన భూతప్పల మండపాన్ని కూడా మరమ్మతు చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికంతటికీ అధికారుల్లో భక్తి లేశమాత్రమైనా లేకపోవడమే కారణమని భక్తులు అంటున్నారు.

ఇప్పటికైనా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి భక్తులకు కావలసిన సౌకర్యాలు కల్పించి ఆలయాన్ని అభివృద్ధిచేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

భక్తరహళ్లి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి పనులు చేపడతాం. భక్తుల సౌకర్యాల కోసం తగుచర్యలు తీసుకొంటాం. -నరసింహరాజు, ఈఓ, మడకశిర



అభివృద్ధికి నోచుకోని భూతప్పల మండపం



గుంతలమయమైన దేవాలయానికి వెళ్లే రోడ్డు

పిల్లల వార్డుకు కొత్త క్యాన్నులాలు

హిందూపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల వార్డులో నాణ్యమైన క్యాన్నులాలను ఏర్పాటు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'చిన్న పిల్లలకు చిత్రహింసలు' అనే కథనానికి సూపరింటెండెంట్ లింగన్న స్పందించారు. ఆసుపత్రిలో నాసిరకం క్యాన్నులాలతో పిల్లలకు ఇబ్బందులు కలిగిన విషయం ప్రచురితం కావడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ గురువారం బయట నుంచి కొత్తవాటిని తెప్పించి అందించారు. నాణ్యత లేని క్యాన్నులాల విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని వారి సూచనమేరకు నడుచుకుంటామన్నారు. ఆసుపత్రిలో ఏవైనా కొరత ఉంటే సిబ్బంది ద్వారా తెలుసుకొని వాటిని సమకూరుస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు పాల కోతపై విచారణ

హిందూపురం అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గత మూ డు నెలల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు కోత విధిస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'పాల రాక్షసులు' కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. శుక్రవారం హిందూపురంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి ఎంక్వైరీ చేయనున్నట్లు ఇన్‌చార్జి పీడి వరలక్ష్మీ ఆంధ్రజ్యోతికి తెలిపారు. జెసి ఆదేశాల ప్రకారం విచారణ జరిపి నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అయితే పాలకు సంబంధించి ఇప్పటికే ఒక నెల బిల్లు చేసినట్లు సమాచారం. మరో బిల్లు ఆపేసినట్లు తెలుస్తోంది. పాలు అందలేదని తెలిసినా బిల్లు ఎలా చేశారని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిల్లు చేసి ఉంటే అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది

కరవుసీమకు పరిశ్రమలు అభినందనీయం

- బాబుకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ కృతజ్ఞతలు

మడకశిరటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మడకశిర లాంటి అత్యంత వెనకబడిన కరవు ప్రాంతంలో పరిశ్రమల మంజూరు కోసం కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును గురువారం క్యాంపు కార్యాలయంలో ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మడకశిర మండల పరిధిలోని ఆర్.అనంతపురం గ్రామ సమీపంలో మందుగుండు పరిశ్రమ ఏర్పాటుకు కృషిచేయడం పట్ల ముఖ్యమంత్రిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత కరవు కాటకాలకు నిలయమైన మడకశిరలో మందుగుండు పరిశ్రమల ఏర్పాటుకు మొదటి దశగా రూ.1500 కోట్లు పెట్టుబడికి ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్లు వారు తెలిపారు.



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

జాతీయ కుస్తీ పోటీకి గోరంట్ల విద్యార్థి ఎంపిక

గోరంట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతమానుపల్లికి చెందిన రోహిత్‌కుమార్ అండర్ 17 బాలుర విభాగం రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు గురువారం ఓప్రకటనలో తెలిపారు. చింతమానుపల్లికి చెందిన వట్టే ప్రకాష్, అరుణ దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారి ఏకైక కుమారుడు రోహిత్‌కుమార్ పెన్నహోబిలం ఎంజెపి పాఠశాలలో పదవతరగతి చదువుతున్నారు. గత మూడేళ్లుగా విద్యార్థి కుస్తీ పోటీల్లో తన దైన ప్రతిభ చూపుతున్నాడు. ఇటీవల చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మూడేళ్లుగా మన రాష్ట్రం తరుపున కుస్తీపోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిసెంబరు మొదటివారంలో ఢిల్లీ ఇంటరేనేషనల్ క్షేత్రశాలిలో జాతీయస్థాయి, రైజిలింగ్ కుస్తీపోట్లో ఈవిద్యార్థి పాల్గొననున్నారు. తన్న ఉన్నతి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోనాథన్, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహులు, శర్మ, వలీకి విద్యార్థి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం



మద్దిలేటిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మడకశిరటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మడకశిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జెల్లిమద్దిలేటికి ఫిజిక్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేయడంతో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. నికెల్-కోబాల్ట్ ఫెర్రోట్ అనే అంశంపై కర్నూల్ రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ సి.బి.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వారు తెలిపారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ చేసిన పరిశోధన సమాజ అభివృద్ధికి దోహద పడుతుందని అన్నారు. దీంతో కళాశాలలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రసాభాసగా పరిగి సర్వసభ్య సమావేశం

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై చర్చించేందుకు గురువారం ఎంపీడీఓ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా రెవెన్యూ గ్రామసభల గురించి మండలంలోని ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ హసీనాసుల్తానా గ్రామసభ నిర్వహించడం బాధాకరమంటూ వాగ్వాదానికి దిగారు. మండల సమావేశానికి తహసీల్దార్ ఎందుకు రాలేదంటూ సభ అధ్యక్షులను ప్రశ్నించగా ప్రజాప్రతినిధులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారుల సలహాల మేరకు ప్రజాప్రతినిధులను శాంతింపజేశారు. మండల సభ యథావిధిగా కొనసాగింది. తహసీల్దార్ హసీనాసుల్తానాను వివరణ కోరగా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో హాజరైనట్లు ఆమె తెలిపారు. అనంతరం మండల సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ సవిత ప్రభాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య వాగ్వాదం

బాబయ్యస్వామి ఉరుసుకు ఆహ్వానం

పెనుకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రసిద్దిచెందిన పెనుకొండ బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవాలు డిసెంబర్ 13న జరుగుతున్న సందర్భంగా ఉరుసుకు కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, డీఈఓ కిష్టప్పకు దర్గా నిర్వాహకులు ఆహ్వానపత్రికలు అందజేశారు. గురువారం దర్గాపీఠాదిపతి తాజ్‌బాబా కుమారుడు 22వ పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా ముస్లిం నగారా జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా, తాజ్‌బాబా శిష్యులు వీరిని కలిసి ఉరుసులో జరిగే గంధం పూజ మహోత్సవం, నేషనల్ ఇంటిగ్రేటెడ్ సెమినార్‌లో హాజరయ్యే కవులకు పురస్కారం, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయాలని కోరారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గోరంట్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన రైతు మునెప్ప పాముకాటుకు గురయ్యారు. బావన్న కుమారుడైన మునెప్ప గడ్డివామిలో పశుగ్రాసం సేకరిస్తుండగా కుడిచేయి చూపుడు వేలిపై పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన అతనికి గోరంట్ల ఆసుపత్రిలో డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సచేసి, మెరుగైన చికిత్సకోసం పుట్టపర్తి ఆసుపత్రికి తరలించారు.

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ

అమరాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండలం మద్దనకుంట గ్రామంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో మరుగుదొడ్లు లేనివారు తప్పనిసరిగా ఇంటి ఆవరణంలో మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటి ఆవరణలో నీటి కొళాయిలను, నీటి సంపులను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్ తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవన్‌కుమార్, ఎన్‌సీఓ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు

రొళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 8, 9, 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల, బాలుర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీటీ ఏటీఎల్ మాట్లాడుతూ నేటి బాలురే రేపటి భావిభారత పౌరులుగా తయారై తల్లిదండ్రులకు దేశానికి ఉపయోగపడేలా తయారుకావాలన్నారు.

రేపు చేపల చెరువు వేలం

గుడిబండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర, కొంకల్లు పంచాయతీ గ్రామాల్లోని చేపల చెరువులను వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శులు దాదాఖలందర్, హరీష్‌లు తెలిపారు. కరికెర పంచాయతీలో కరికెర, రాజబండ చెరువు, హిరేతుర్పి చెరువు, కొంకల్లు చెరువు, మేకలగట్ట చెరువులను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో వేలం వేస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కరికెర పంచాయతీ కార్యాలయంలో, మధ్యాహ్నం 2 గంటల నుండి కొంకల్లు పంచాయతీ కార్యాలయంలో వేలం వేస్తామన్నారు. వేలం పాట కార్యక్రమానికి ఈఓఆర్డీ నాగరాజునాయక్, సర్పంచులు గౌరమ్మ హాజరవుతారన్నారు.

చనిపోతున్నా..

వాట్సాప్‌లో ఉపాధ్యాయుడి లేఖ

- హెచ్ఎం వేధింపులే కారణమని ఆరోపణ

గుడిబండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయురాలి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ మండలంలోని పి.సి.గిరి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి గురువారం వాట్సాప్‌లో లేఖ పోస్టు చేయడం కలకలం రేపింది. ఆయన రెండ్రోజులపాటు సెలవు పెట్టారు. గురువారం పాఠశాలకు వెళ్లారు. 'ప్రధానోపాధ్యాయురాలు శశికళ పాఠశాలకు రావద్దని హెచ్చరించారనీ, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటాన'ని లేఖ రాసి, వాట్సాప్‌లో పంపారు. అందుకు ప్రధానోపాధ్యాయురాలు శశికళే కారణమని అందులో పేర్కొన్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి స్వగ్రామమైన మండలంలోని మందలపల్లి వద్ద బైక్ నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. చెట్టును ఢీకొట్టి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నంలో ఇలా జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈవిషయమై ప్రధానోపాధ్యాయురాలు శశికళను అడగ్గా.. ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి రోజూ మద్యం తాగి పాఠశాలకు వస్తూ.. తోటి టీచర్లతో గొడవకు దిగుతున్నారన్నారు. నానా దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలపడంతోపాటు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం తెలిపారు.



గాయపడిన రామసుబ్బారెడ్డి

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి



శివకుమార్ (ఫైల్)

పరిగి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇండియన్ గార్మెంట్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న శివకుమార్(29) గురువారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు హిందూపురం మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన శివకుమార్ కుటుంబం ఏడాదిక్రితం బతుకు తెరువుకై పరిగికి వచ్చి అక్కడ అద్దె ఇంట్లో నివాసముంటోంది. ఇండియన్ గార్మెంట్స్‌లో శివకుమార్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గురువారం యథావిధిగా పరిశ్రమలో పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 2గంటల సమయంలో ఉన్నట్టుండి అతడు కుప్పకూలడాన్ని గమనించిన కార్మికులు హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గార్మెంట్స్ యాజమాన్యం గుండెపోటుతో మృతిచెందినట్లు పుకార్లు పుట్టించడం బాధాకరమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ద్వారా శివకుమార్ మృతిచెందిన సంఘటనను చూపించాలంటూ కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మృతునికి భార్య గీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

పెనుకొండ రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావటూరు గ్రామంలో రైతు సుధాకర్‌రెడ్డి (35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు మావటూరు గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి, వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సుధాకర్‌రెడ్డికి పేకాట జూదం అలవాటు ఉంది. గతంలో రెండుమార్లు సుధాకర్‌రెడ్డి పేకాట స్థావరాల్లో పట్టుబడ్డాడు. తరచూ పేకాట ఆడుతున్నావని సుధాకర్‌రెడ్డి తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటి పక్కనే పశువుల షెడ్డులో ఉరికి వేలాడుతూ శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే రైతు సుధాకర్‌రెడ్డికి చెరువుకు సంబంధించిన 300సర్వేనంబరులో 1.5ఎకరాల భూమి ఉంది. అందులో బోరువేసి పంటను పండించి కుటుంబాన్ని పోషించుకునే వాడు. సుధాకర్‌రెడ్డి భూమికి అనుకుని చెరువుకు సంబంధించిన భూమిలో ఇటీవల సీసీరోడ్డు వేశారు. అయితే గ్రామానికి చెందిన కొందరు 'నీ భూమిలో రోడ్డువేశాం, బోర్లు కూడా పీకేస్తాం, మిగిలిన భూమికూడా నీకు దక్కకుండా చూస్తాం' అంటూ బెదిరింపులు చేయడంతో సుధాకర్‌రెడ్డి మనస్థాపానికి గురై గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు అతని మామ రఘునాథ్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వెంకటేశ్వర్లు లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సుధాకర్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన నవీన్‌కుమార్(33) తన షాపులో గురువారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుడిపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ వెంకటేశ్ కుమారుడు నవీన్‌కుమార్ కొన్నేళ్లుగా సోమందేపల్లిలోని వినాయకనగర్‌లో భార్యాపిల్లలతో నివాసముంటున్నాడు. ఇతను కొత్తపల్లి వద్ద ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం అదే షాపులో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన సోమందేపల్లి ఆసుపత్రికి తరలించారు.

అక్కడి నుంచి పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. అతడి ఆత్మహత్యకుగల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. నవీన్‌కుమార్‌కు భార్య జయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆటో బోల్తా.. ఒకరి దుర్మరణం

పెనుకొండ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెరువుకట్ట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో పాత జాతీయరహదారిపై ప్రమాదవశాత్తు ఓ ఆటో బోల్తాపడి ఓబులమ్మ(50)అనే మహిళ మృతిచెందగా మరో నలుగురు గాయపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కియా ఎఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు ధర్మవరం ఏజెనగర్‌కు చెందిన ఓబులమ్మ, పుష్పలత, ఆదెమ్మ, లోకేశ్వరి, చంద్రశేఖర్ అనే ఐదుగురు ఆటోలో ధర్మవరం నుంచి పెనుకొండ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో సోలార్ కంపెనీ వద్దకు రాగానే ఆటో ముందు చక్రం విరిగి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఓబులమ్మ మార్గమధ్యంలో మృతిచెందింది. చంద్రశేఖర్‌కు తీవ్రగాయాలుకాగా ఆదెమ్మ, లోకేశ్వరి, పుష్పలత స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ మురళికూడా గాయపడ్డారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన ఆటో